# ఇంజనీరింగ్‌లో 93 శాతం సీట్ల భర్తీ

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టీజీఎప్‌సెట్‌లో భాగంగా ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి సంబంధించిన మొదటి విడత జాబితాను శనివారం ప్రకటించారు. కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో మొత్తం 83,054 సీట్లు అందుబాటులో ఉండగా.. 77,154 సీట్లు కేటాయించారు. మొత్తం సీట్లలో ఇవి 92.89 శాతం. ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలో మొత్తం 195 సీట్లు ఉండగా 119 (61.03%), 20 యూనివర్సిటీల కాలేజీల్లోని 6,108 సీట్లలో 5,163 (84.53%), రెండు ప్రైవేటు యూనివర్సిటీల్లోని 1,367 సీట్లలో 1,357 (99.26%), 149 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లోని మొత్తం 75,384 సీట్లలో 70,515 (93.54%) సీట్లు భర్తీ అయ్యాయి. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 5,900 సీట్లు మిగిలి ఉన్నాయి. మొదటి విడతలో 95,256 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయిందని, 94,059 మంది ఆప్షన్లు ఇచ్చారని ఎప్‌సెట్ కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. మొత్తం 56.63 లక్షల ఆప్షన్లు స్వీకరించామని, 16,905 మంది ఆప్షన్లు ఇచ్చినా సీటు ఖరారు కాలేదన్నారు. మొత్తం 6,021 మంది ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు పొందారు. ఇది నమూనా (మాక్) సీట్ల కేటాయింపు అని, సంతృప్తి చెందని విద్యార్థులు ఈ నెల 15 వరకు ఆప్షన్లు మార్చుకోవచ్చని విద్యార్థులను శ్రీదేవసేన కోరారు. మార్పులు చేయని విద్యార్థులకు ఇవే సీట్లు కేటాయిస్తారు. అదనపు సీట్ల విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రెండో విడతలో మరిన్ని సీట్లు అందుబాటులోకి రానున్నాయి.